క్లుప్తంగా

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, మండలంలోని జూలెకల్ స్టేజీలోని ఎరువుల దుకాణాలను ఏఓ రాధ బుధవారం పరిశీలించారు. శాంతినగర్‌లోని సంకల్ప్ మందుల అంగడి, జూలెకల్ స్టేజీలోని లలిత ఫర్టిలైజర్స్ దుకాణాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణా దారులకు వ్యవసాయశాఖ చట్టాల గురించి వివరిస్తూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ఎమ్మార్పీ ధరకంటే ఎక్కువ ధరకు మందులు అమ్మకూడదని డీలర్లకు సూచించారు.

పంటల వివరాలు నమోదు



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు శివారులో రైతులు సాగుచేసిన పంటల వివరాలను ఏఈఓ చంద్రకళ బుధవారం నమోదు చేశారు. గ్రామ శివారులోని ఆయా సర్వేనంబర్లలో రైతులు సాగుచేసిన పత్తి, కంది పంటల వివరాలను రికార్డుల్లో నమోదు చేసినట్లు ఏఈఓ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం



అయిజ: మండలంలోని వెంకటాపురం స్టేజీలో బుధవారం రేకులు, ఐరన్ పైపులను లోడ్ చేసుకొని వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డోన్ నుంచి మల్దకల్ మండలానికి ఆటో బయలుదేరింది. వెంకటాపురం స్టేజీ వద్ద రోడ్డు ఎత్తు పల్లాలు ఉండడంతో ఆటో బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. బోల్తాపడిన ఆటోను అక్కడున్న స్థానికులు పైకి లేపారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

అఖండ సంకీర్తనలో తుపత్రాల భక్తులు



అయిజ: తిరుమల–తిరుపతి దేవస్థానంలో నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తనలో అయిజ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల మారుతి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. బుధవారం స్వామివారి సన్నిధిలో వేంకటేశ్వర స్వామివారి సంకీర్తనలు ఆలపించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ వారు భజన మండలి సభ్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వెంకట్రాములు, వెంకన్న గౌడ్, వెంకటన్న, అశోక్ గౌడ్, పరశురాముడు, రామాంజనేయులు గౌడ్, హనుమంతు, వెంకటేష్, పెద్ద అశోక్ గౌడ్, భీంచంద్ర, విజయ్‌గౌడ్, వీరేష్, హరి పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

గట్టు: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత మేస్త్రీ తిమ్మప్ప తల్లి బుడ్డమ్మ (80) బుధవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీపీ విజయ్‌కుమార్, కేటీదొడ్డి జెడ్పీటీసీ రాజశేఖర్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరుకు చెందిన మద్దిలేటి, అదే గ్రామానికి చెందిన పార్వతమ్మ అనారోగ్యంతో కర్నూల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ పోతురాజు సోమనాద్రి పరామర్శించి ఇరువురికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు.

బైక్ అదుపుతప్పి బోల్తా

మానవపాడు: జాతీయ రహదారి–44పై బైక్ అదుపు తప్పి బోల్తాపడి గాయాలైన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మానవపాడు మండలకేంద్రం నుంచి బైక్‌పై మహబూబ్, మరో ఇద్దరు స్నేహి తులు షేక్‌షావలి, సుబాన్‌బాబు కలిసి కర్నూల్ వైపుగా వెళ్తున్నారు. జాతీయ రహదారి–44పై జల్లాపురం స్టేజీ శివారుప్రాంతంలో ముగురు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి కింద పడింది. మైదుకు తీవ్ర గాయాలు అయినవి, ఇద్దరికి స్వల్ప గాయాలు అయినవి. వీరిని మానవపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ చంద్రకాంత్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- అమ్మ ఆదర్శ కమిటీలతో సర్కార్ స్కూళ్లలో మరమ్మతులు
- నిధులతో చురుగ్గా పనులు
- మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు..





నారాయణపురంలో పాఠశాల మరమ్మతులు చేయకముందు, పనులు పూర్తి చేశాక పైకప్పు

మానవపాడు: ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ పట్టింది. ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాలల్లో ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాటికి మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అధికారులు, నాయకులు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మండలంలో మొత్తం 24 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 3 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాల, 12 ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు 8 ఉన్నాయి. 24 ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 2600మంది విద్యార్థులు చదువుతున్నారు. 15 అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఎంపికయ్యాయి. 8 పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో మనఊరు–మనబడి పాఠశాలకు ఎంపికై మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

గ్రామాల వారీగా వివరాలు..

మానవపాడు మండలంలో 15 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఎంపికైనవి. దాదాపు మొత్తం రూ. 53.64లక్షల నిధులతో పనులు జరుగుతున్నాయి. జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.7.85లక్షలు, పెద్దపోతులపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.1.20లక్షలు, కలుకుంట్ల ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.24వేలు, కొర్విపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.2.64 లక్షలు, పల్లెపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.10.89లక్షలు, చిన్నపోతులపాడు ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.3లక్షలు, మానవపాడు ఎంపీపీఎస్ ఎస్సీ పాఠశాలకు రూ.6.30లక్షలు, ఏ.బుర్దిపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.1.55లక్షలు, చంద్రశేఖర్‌నగర్ ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.4.09లక్షలు, నారాయణపురం ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.3.35లక్షలు, గోకులపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.4.13లక్షలు, పెద్దఆముదాలపాడు ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.1.80, చండూరు ఎంపీపీఎస్ పాఠశాలకు 1.20, శ్రీనగర్ క్యాంపు ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.1.70, మానవపాడు ఉర్దూ మీడియం పాఠశాలకు రూ.3.70 లక్షలు విడుదలై పాఠశాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి, మరికొన్ని పనులు పూర్తి అయినవి.



కొర్విపాడులో అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో నిర్మిస్తున్న కొళాయిలు

విద్యార్థుల ఆనందం..

గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపడుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో కొన్నేళ్లుగా కనీసం మరుగుదొడ్ల మరమ్మతులు చేపటకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లు. ఇక నుంచి ఆ బాధలు తీరనున్నాయని సంతోషపడుతున్నారు. పాఠశాలల్లో మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో తమ ఇళ్ల నుంచి పుస్తకాలతో పాటు మంచి నీళ్ల బాటిళ్లు తెచ్చుకునేవాళ్లు ఇక నుంచి అలాంటి అవసరం లేకుండా పోతుంది. వాటితో పాటు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి పడేవారు. మెరుగైన సౌకర్యాలు కల్పించనుండడంతో విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు.

90శాతం పనులు పూర్తి ..



నారాయణపురంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలకు రూ.3.35లక్షల పనులకు నిధులు మంజూరయ్యాయి. పాఠశాల పనులను త్వరతగతిన పూర్తి చేయించాం. పాఠశాలలో దాదాపు 90శాతం పనులు పూర్తి అయినవి. ప్రభుత్వం ప్రహరీ నిర్మాణానికి చేయూత అందిస్తే బాగుంటుంది. పాత పాఠశాలను తొలగించి కొత్త తరగతి గదులు నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– సతీష్‌రెడ్డి, నారాయణపురం

పనులు కొనసాగుతున్నాయి

మండలంలోని 15 ప్రభుత్వ పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎన్నికైంది. వాటిలో చాలా చోట్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 15 పాఠశాల దాదాపు 70శాతం పనులు పూర్తి అయినవి. కొన్ని చోట్ల పనులు పూర్తి అయినవి. ప్రతిరోజు పాఠశాలలను సందర్శించి, పనులు వేగవంతం చేయిస్తున్నాం. త్వరగా ప్రతి చోటా పనులు పూర్తి చేయిస్తాం.

– శివప్రసాద్, ఎంఈఓ మానవపాడు

ఘనంగా నేషనల్ డీ వార్మింగ్ డే



క్యాతూర్‌లో ఎన్‌డీడీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మానవపాడు: మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం డాక్టర్ రిజ్వానా తాన్సీర్ ఆధ్వర్యంలో ఘనంగా నేషనల్ డీ వార్మింగ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 20, 27వ తేదీన అల్బెండజోల్ మాత్రలు 1 నుంచి 5 సంవత్సరాలు చిన్నారులకు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న చిన్నారులకు పొడిచేసి నీళ్లలో కలిపి అందించాలని తెలిపారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు 6నుంచి 19 సంవత్సరాల వయస్సు వారికి నమిలి మింగించాలని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలు రక్తహీనతను, పోషకాహార వినియోగతను మెరుగుపరుస్తుందన్నారు. ఎల్లప్పుడు పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజోళి: 1–19 ఏళ్ల వయసున్న పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మెడికల్ ఆఫీసర్ మధుబాబు తెలిపారు. 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు, విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ మాత్రలు అందించడం జరిగిందని, ఈ మాత్రలు వాడే విధానాలను అంగన్‌వాడీ సిబ్బందికి, వైద్య సిబ్బందికి, పంపిణీ చేసేవారికి వివరించినట్లు ఆయన తెలిపారు.

ఎన్‌డీడీపై అవగాహన ర్యాలీ

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 20న నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తుల శుభ్రతతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ర్యాలీలో నినాదాలు చేశారు. పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి, పీహెచ్ఎన్ లీలమ్మ, హెచ్ఏ సువర్ణ, గుల్నర్‌బాను, ఆశ కార్యకర్తలు ఆబేదబేగం, జయమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

పాఠశాలను ఆకస్మిక తనిఖీ



కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని కొండాపురం కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పాగుంట పాఠశాలను హెచ్ఎం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో బోర్డుపై గుణాంకలు చేయించి సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బడి బయట పిల్లలపై ఆరా తీశారు. వారి వెంట సీఆర్పీ యుగంధర్, హెచ్ఎం స్వాతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నీట్ లీకేజీపై కేంద్రం స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

అలంపూర్: దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష లీకేజీపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం విద్య రంగాన్ని గాలికి వదిలేసిందన్నారు. నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం సరికాదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. కుట్ర పూరితంగానే పరీక్ష కంటే ముందే పేపర్ లీకేజీలు అవుతున్న కేంద్రం ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి కారణమైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నాగరాజు, పట్టణ కార్యదర్శి అయ్యప్ప, నాయకులు సిద్ధయ్య, గంగన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో సీట్లను పెంచాలి



గట్టు: కస్తూర్బా పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచాలని ఎంపీపీ విజయ్‌కుమార్ బుధవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు లభించక చాలా మంది బాలికలు ఉన్నత పాఠశాల చదువులకు దూరమవుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీపీ తెలిపారు. సీట్లు దొరకని బాలికలు మళ్లీ పొలంబాట పడుతున్నట్లు తెలిపారు. గట్టు మండలంలో బాలికల చదువు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కస్తూర్బా పాఠశాలలో 40 సీట్లు మాత్రమే ఉండగా, 55 మంది దాకా అడ్మిషన్లు పొందుతున్నారని, వారికి ఆహారంతో పాటుగా వసతి సమస్య నెలకొన్నట్లు ఎంపీపీ తెలిపారు. గట్టు మండలంలో ఇప్పటి వరకు 135 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, కస్తూర్బా పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచి బాలికల చదువుకు చేయూత అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ తెలిపారు.

కాంగ్రెస్ అగ్రనేత జన్మదిన వేడుకలు



ఎర్రవల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

అలంపూర్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అలంపూర్ పట్టణంలోలో ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌ప్రజ్ఞ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి, బాలింతలకు పండ్లు, బ్రేడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు శంకర్ గౌడ్, రంజిత్ కుమార్, మన్సూర్ అహ్మద్, శివనాయుడు, మునీర్ బాష, ప్రభుదాసు, గంగాధర్ ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలంపూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి హాజరై ప్రాథమిక పాఠశాల చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు, బిస్కెట్స్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లోని పేదలకు గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్ట్ చేపడుతున్న వివిధ సామాజిక కార్యక్రమాల గురించి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సీఈఓ దుర్గాప్రసాద్, నిర్వాహకులు రాధిక, రాజశేఖర్, మండల కోఆర్డినేటర్ అబ్రహం, ప్రవీణ్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్



అలంపూర్‌లో విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్న ఎంఈఓ అశోక్‌కుమార్

అలంపూర్: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని న్యూ ప్లాట్స్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఎంఈఓ అశోక్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం 2023–24 విద్యా సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు సాయిప్రకాష్ రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. ఎంఈఓ అశోక్‌కుమార్ 10వ తరగతిలో 9.0 గ్రేడ్ సాధించిన విద్యార్థి మాస్టర్ శైలేష్ కుమార్‌కు, 8.8 గ్రేడ్ సాధించిన సందీప్ కుమార్‌కు ఒక్కొక్కరికి రూ.5వేల నగదును ఎంఈఓ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతమైన నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఉత్తమ గ్రేడ్‌లను సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి నగదును అందజేసిన భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు సాయిప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భారతి, నజీమా తబ్సుమ్, ఆదామ్‌బీ, రాజశేఖర్‌గౌడ్, బషీర్ అహ్మద్, పీఈటీ బలగం నాగరాజు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



పచ్చర్లలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం

రాజోళి: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని, ప్రతి తల్లిదండ్రులు దీన్ని గమనించి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ హరిమిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పచ్చర్ల గ్రామంలో బడి బాట ముగింపు సందర్భంగా ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డ్రాప్ ఔట్ అయిన పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ బడిలో మెరుగైన విద్యతో పాటు, దుస్తులు, పుస్తకాలు, నాణ్యమైన భోజనం అందిస్తున్నారని, ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులచే పాఠాలు బోధించడం జరుగుతుందన్నారు. అన్నీ వసతులతో ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ బడిలో విద్య ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ గౌడ్, సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు పెద్దరెడ్డి, చిన్న తిమ్మప్ప గౌడ్, గోవిందు, మారెన్న, పద్మమ్మ,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు యూనిఫామ్స్‌ను అందజేస్తున్న కౌన్సిలర్ వసీమాబేగం



ధరూరులో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ

గద్వాల అర్బన్: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని కౌన్సిలర్ వసీమాబేగం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మోమిన్ మహెల్లా 11వ వార్డులోని ఉర్దూ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా బుక్స్, యూనిపామ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ అన్వర్ బేగం, స్కూల్ కమిటీ సభ్యులు ఇసాక్, సబీయా బేగం తదితరులు ఉన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. బుధవారం కళాశాల ఆవరణలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 450 మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో నిష్ణాతులైన అధ్యాపకులు ఉంటారన్నారు. విద్యార్థులు బాగా చదివి కన్న వారికి మంచి పేరు తీసుకు రావడంతో పాటు ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేరాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు, అధికారులు

శాంతినగర్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు చేరవేయడం, డ్రెయినేజీ కాల్వలు శుభ్రంగా వుంచడం, వర్షపు నీరు గుంతల్లో నిల్వ వుండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎజెండా అంశాలను చర్చించి సభ్యులందరు ఆమోదించారు. పట్టణ ప్రాంతాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై సభ్యులందరు చర్చించి నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి



ప్రైవేట్ పాఠశాలలో విక్రయిస్తున్న పుస్తకాలతో నాయకులు

గద్వాల అర్బన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పుస్తకాలను పట్టుకున్నారు. ఈ విషయంపై ఎంఈఓకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలల దగ్గరకు చేరుకుని పుస్తకాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రైవే ట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం, టై, షూలను విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. పాఠశాలలకు సంబంధించిన బుక్స్‌ను బుక్ సెంటర్ల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకొని విద్యార్థులకు విక్రయిస్తున్నారన్నారు. వెంటనే బుక్స్‌ను విక్రయిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హలీమ్ పాష, నాయకుడు సుభాన్, ఉన్నారు.